కండ్లకుంటలో కష్టాలు

- రోడ్డు, విద్యుత్ సౌకర్యం కరువు
- పక్కా గృహాలు లేక ప్రజల అవస్థలు
- కూలి పనులకు సైతం ఇబ్బందులు



అధ్వానంగా ఉన్న దారి



అడవి ప్రాంతంలో ఉన్న కండ్లకుంట గ్రామం

అమ్రాబాద్: కండ్లకుంటలో ప్రజలు నిత్యం కష్టాలతో సతమతమవుతున్నారు. నూతనంగా ఏర్పడిన జోత్యనాయక్‌తండా పంచాయతీ పరిధిలోని ఈ గ్రామం అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఇక్కడ 22 కుటుంబాలు మాత్రమే జీవిస్తున్నాయి. ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. సాగు చేసుకుంటున్న అటవీ భూమి కూడా ఇరు వర్గాల ఘర్షణ వల్ల కోర్టులో వాదనలు నడుస్తున్నాయి. ఫలితంగా కూలీ చేస్తేనే కడుపు నిండేది. కూలి పనులకు ఆరు కిలోమీటర్లు కాలినడకతో ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో అష్టకష్టాలతో జీవనం సాగిస్తున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పక్కాఇళ్లు, విద్యుత్ సౌకర్యం లేవు..

గ్రామంలో ఇంత వరకు పక్కా ఇళ్లు లేవు. పూరిగుడిసెలు, తడికల గుడిసెల్లోనే కాపురాలు. వర్షకాలం, చలికాలం, వేసవి కాలం ఇలా ఏ కాలంలో అయినా ఇబ్బందులు తప్పవు. వేసవిలో అగ్నిప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇళ్లమధ్యనే పిచ్చిమొక్కలు, చెట్లు దట్టంగా అలుముకున్నాయి. విద్యుత్ సౌకర్యం లేక పోవడం వల్ల రాత్రి వేళ్లలో గుడ్డి దీపాల మధ్యనే ఉంటున్నారు. పరిసరాల్లో పాములు, తేళ్లు, ఇళ్లలోకి రావడం, ఎలుగుబంట్లు, వివిధ జంతువుల అరుపులతో బిక్కుమంటూ జీవితాలు గడపాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాళ్లతో నిండిన రహదారి..

అమ్రాబాద్ మండలం జంగంరెడ్డిపల్లి నుంచి, పదర నుంచి ఎక్కడ వెళ్లాలన్నా ఐదు కిలోమీటర్లు దూరం ఉన్న ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేదు. 2012లో రోడ్డుకు అటవి ప్రాంతంలో మట్టి(మొర్రం), మైదాన ప్రాంతంలో మొటల్ వేశారు. అప్పట్లో పనులు నామమాత్రంగా చేయడం వల్ల మొటల్ తొలగిపోయింది. అడవి మార్గంలో రెండు కిలోమీటర్ల మేర రాళ్లు తేలి ఉన్నాయి. ప్రస్తుతం 108 వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వంలో కండ్లకుంటకు నడక దారిన వెళ్లిన అధికారులకు రోడ్డు బాగు చేయించాలని వేడుకున్నా పట్టించుకోలేదు. ఇన్ని సమస్యల మధ్య జీవనం సాగించేదెలా అని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఏళ్ల కొద్ది బాధలు..



ఇళ్లు నిర్మించాలి, సాగు చేసుకుంటున్న భూములు కోర్టు పరిధిలో ఉన్నాయి. కూలి పనులకు నిత్యం ఎంతో దూరం వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి. రోడ్డు సౌకర్యం లేక కనీసం ప్రైవేట్ వాహనాల రాకపోకలు కూడా లేవు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్యలు పరిష్కరించాలి. – జంగయ్య, కండ్లకుంట

క్లుప్తంగా

వెన్నెలకు పదవి రావడంపై హర్షం

కల్వకుర్తిరూరల్: తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలను నియమించడంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కవులు, కళాకారులకు ప్రభుత్వం పెద్ద పీటం వేస్తున్నదన్నారు. ఆదివారం వారు తాండ్రలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



లింగాల: మండలంలోని చెన్నంపల్లి వెళ్లే మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలస్వామి, రాములుకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. చెన్నంపల్లికి చెందిన ఇరువురు లింగాలకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, వాహనం అదుపు తప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఖాజా, లక్ష్మణ్ ప్రథమ చికిత్స నిర్వహించి అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సగర సంఘం నూతన కమిటీ ఎన్నిక



కల్వకుర్తిరూరల్: సగర సంఘం నూతన కమిటీలను ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, కోశాధికారి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పట్టణ అధ్యక్షుడిగా రాజుసాగర్, ప్రధాన కార్యదర్శిగా జంగయ్యసాగర్, కోశాధికారిగా యాదగిరి ఎన్నికయ్యారు. మండల శాఖ అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, కోశాధికారిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. యువజన సంఘం అధ్యక్షుడిగా భరత్, కార్యదర్శిగా నరేష్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, కోశాధికారిగా అరుణ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, భీమయ్య, దుర్గయ్య, తదితరులతో పాటు పలువురు మాట్లాడారు.

ముగిసిన కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ కోటి లింగేశ్వర దత్త దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం విజయవంతంగా ముగిసింది. కోటిలింగాల ప్రతిష్ఠమహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రహోమం, రుద్రపఠనం నిర్వహించి, 20 శివకోటి యంత్రాలకు పూజలు చేశారు. భక్తులు స్వయంగా పదకొండు వేల శివలింగాలను ప్రతిష్ఠించి శివానుగ్రహం పొందారు. అపూర్వ కార్యక్రమం ద్వారా భక్తులు తమ ఆధ్యాత్మికతను చాటుకున్నారు.

ఆకుముడత తెగులుతో ఇబ్బందులు

వీపనగండ్ల: జిల్లాలో అత్యధిక మామిడి పంటను సాగు చేస్తున్న రైతులు 10 రోజులుగా మామిడి తోటలకు ఆకుముడత, మచ్చ తెగులుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, కల్వరాల, వీపనగండ్ల తదితర గ్రామాల్లో దాదాపు 8 వేల ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తోటలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు, మందులు అందజేస్తామని అధికారులు ఆర్భాటపు ప్రకటనలు చేశారు తప్ప ఎలాంటి సహాయం అందలేదని రైతులు నిరాశకు గురవుతున్నారు.

గ్రూప్‌-3 పరీక్షలు ప్రశాంతం



పరీక్ష రాసేందుకు పరీక్ష కేంద్రానికి వెలుతున్న అభ్యర్థులు

తెలకపల్లి: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్‌-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం మండల కేంద్రంలో కేకేరెడ్డి పాఠశాలలో మొత్తం 312 మందికి 215 మంది హాజరు కాగా, 97 మంది గైర్హాజరయ్యారు. బాలికల గురుకుల పాఠశాలలో 240 మందికి 165 మంది హాజరు కాగా, 75 మంది గైర్హాజరయ్యారు. తెలకపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 227 మందికి, 138 మంది హాజరు కాగా, 89 మంది గైర్హాజరయ్యారు. మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో 312 మందికి, 217 మంది హాజరు కాగా, 95 మంది గైర్హాజరయ్యారు. శాంతినికేతన్ పాఠశాలలో 288 మందికి, 195 మంది హాజరు కాగా, 93 మంది గైర్హాజరయ్యారు. గోవర్ధన్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో 384 మందికి, 275 మంది హాజరు కాగా, 108 మంది గైర్హాజరైనట్లు అధికారులు, ఎస్‌ఐ నరేష్ తెలిపారు. మొత్తం ఆరు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు పరీక్ష కేంద్రాలు సందర్శించి పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.



పరీక్ష కేంద్రం వద్ద డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ నరేష్, సిబ్బంది

గ్రూప్‌-3 పరీక్షకు 12 మంది అభ్యర్థులు ఆలస్యం

బిజినేపల్లి: బిజినేపల్లి మండలంలోని బిజినేపల్లి, పాలెం గ్రామాల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాలకు 12 మంది అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని లోపలికి అనుమతించలేదు. పాలెం శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ కళాశాలలో 11 మంది అభ్యర్థులు ఆలస్యంగా రాగా, బిజినేపల్లి మండల కేంద్రంలోని మరో పరీక్ష కేంద్రానికి ఒకరు ఆలస్యంగా వచ్చినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య

సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి



మాట్లాడుతున్న న్యాయవాది తిప్పారెడ్డి

ఆత్మకూర్: భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ఏ, 45 ప్రకారం దేశంలోని 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని ఆత్మకూర్ సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని, ఆరేళ్లలోపు చిన్నారులందరికి పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదిగా చేస్తూ గతంలో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షనీయమని, ఎలాంటి షరతులు లేకుండా ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని కోరారు.

అమలుకు హైకోర్టు ఉత్తర్వులు..

ఉచిత నిర్బంధ విద్య అమలు కోసం హైకోర్టులో వేసిన పిటీషన్‌కు చీఫ్ జస్టీస్ సానుకూలంగా స్పందించి తీర్పును వెలువరించారని, అందుకు సంబంధించిన ప్రతులు తనకు అందాయని న్యాయవాది తిప్పారెడ్డి తెలిపారు. ఈ విషయమై తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ 2025–26 విద్యాసంవత్సరంలో 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని అంగీకరించారన్నారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టి సారించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టలేక చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, నారాయణపేట జిల్లాలోని మక్తల్‌ను రెవిన్యూ డివిజన్‌గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

బాలోత్సవాల పోస్టర్ విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న సోమయ్య

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 19న నిర్వహించే బాలోత్సవాల పోస్టర్‌ను ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ భవనంలో విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి సోమయ్య, వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల్లో ఉన్న నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు నివేదిక చక్కటి అవకాశాన్ని ఇస్తుందని, భవిష్యత్‌లో ధైర్యంగా ఆయా రంగాల్లో ఎదిగేందుకు నివేదిక తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ చెన్నయ్య, మల్లయ్య, లక్ష్మణమూర్తి, ఖాదర్‌పాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



వెల్దండలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి భరత్‌కు హైదరాబాద్ జియాగూడకు చెందిన యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య ఆదివారం బాధితుడికి రూ.51వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల భరత్ అనారోగ్యానికి గురికావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. భరత్ కిడ్నీ సమస్యతో బాధపడుతుండడంతో ఆర్థికంగా ఆదుకోవడానికి ముందుకొచ్చారు. వెల్దండ సిరి ఇండియన్ గ్యాస్ నిర్వహకులు రూ.8వేలు, మాజీ ఎంపీటీసీ చిందం కృష్ణయ్య రూ.2500 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అంజియాదవ్, తదితరులు ఉన్నారు.

రేపు ఉరేడమ్మ ఉత్సవాలు



అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన శ్రీ ఉరేడమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం కొనసాగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శుభ్ర పరిచి రంగులతో అలంకరించే పనుల్లో ఆలయ నిర్వహకులు నిమగ్నమయ్యారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఉరేడమ్మ దేవత ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అమ్మవారికి తీపి వంటకాలతో నైవేద్యం సమర్పించడం ప్రత్యేకత. ఉరేడమ్మ జాతరలో జంతుబలులు ఉండవని, ఇది సంప్రదాయమని నిర్వహకులు తెలిపారు.

అంతర్గత రోడ్లు బురదమయం



కుడికిల్ల ఎస్సీ కాలనీలో బురదమయమైన అంతర్గత రోడ్డు

కొల్లాపూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించింది. అంతర్గత రోడ్లు బురదమయమై నడవడానికి కూడా ఇబ్బందిగా మారాయి. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన అస్తవ్యస్తంగా ఉంది. ఏ గ్రామానికి కూడా ప్రత్యేక అధికారి పోవడం లేదు. పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో చేయించడం లేదు. ప్రధాన రహదారులపై మురుగు పారుతున్నా పట్టించుకోవడం లేదు. కుడికిల్ల, ఎన్మన్‌బెట్ల, అంకిరావుపల్లి, చుక్కాయపల్లి, రామాపురం, ఎల్లూరు, తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కల్వకుర్తిరూరల్: భారతీయ జనతాపార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బండెల రామచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సురేందర్‌గౌడ్ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామచంద్రారెడ్డి, నిరంజన్‌గౌడ్ గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిపై ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించారు. పార్టీ బలోపేతానికి మొదట గ్రామాలలో కమిటీలు నియమించుకోవాలన్నారు. ఆ కమిటీల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గంగాధర్‌చారి, బి కృష్ణారెడ్డి, శ్రీశైలం, కిరణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే



మండల కేంద్రంలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయిలో ఎన్యుమరేటర్లతో సర్వే కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, గుంతకోడూరు గ్రామాల్లో ఎన్యుమరేటర్లు చేసే సర్వే విధానం, వివిధ అంశాలపై సర్వే పరిశీలకులు శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మాచారిలు అవగాహన కల్పించారు.

రోడ్డుపై విద్యుత్ స్తంభాలు తొలగించండి



రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు

ఉప్పునుంతల: ఉప్పునుంతల నుంచి అచ్చంపేట వరకు ఉన్న సింగిల్ రోడ్డు మార్గాన్ని గత కొన్నేళ్ల క్రితం రెండు వరుసల బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసినా నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ లైన్లను మార్చకుండా వదిలేశారు. మల్లప్పవాగు సమీపంలో రోడ్డుపై విద్యుత్ స్తంభాలు ప్రమాదభరితంగా ఉన్నాయి. లింగోటం తండా సమీపంలో విద్యుత్ స్తంభాలు రోడ్డుపైనే ఉన్నాయి. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు పక్కకు వెళ్తే విద్యుత్ తీగలు తగిలేంత ఎత్తులో ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు హెడ్ లైట్ల వెలుగుకు కన్పించక స్తంభాలను ఢీకొనే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి జాప్యం చేయకుండా రోడ్డుపై ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా పశువైద్యశాల



పెద్దకార్పాములలో నిరుపయోగంగా పశువైద్యశాల భవనం

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల గ్రామంలో పశువైద్యశాఖ అధికారులు లేక గ్రామీణ పశువైద్యశాల నిరుపయోగంగా మారింది. రూర్బన్ మిషన్ కింద గ్రామంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వైద్య సేవల కోసం రూ.15 లక్షలతో నిర్మించారు. పశువైద్యశాలకు అధికారులు లేక నిరుపయోగంగా మారింది. గ్రామంలో పశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు రోగాల భారిన పడితే మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించి వైద్య సేవలు చేయిస్తున్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ పశువైద్యశాలలకు సిబ్బందిని భర్తీ చేయాలని రైతులు లక్ష్మయ్య, రాములు, ఆంజనేయులు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఇందిరక్రాంతి భవనం



అర్థాంతరంగా నిలిచిన నిర్మాణ పనులు

తాడూరు: మండల కేంద్రంలో దశాబ్ద కాలంగా రూ.18 లక్షలతో హడావుడిగా నిర్మాణం చేపట్టిన ఇందిరాక్రాంతి భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా అర్థాంతరంగా నిర్మాణ పనులు ఆగిపోయాయి. మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీని అనుసరించుకొని నిర్మించిన ఇందిరా క్రాంతి భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయంటూ సంబంధిత కాంట్రాక్టర్ పేర్కొన్నారు.

పదిహేను ఏళ్లు దాటినా పట్టింపులేదా?

శిథిలావస్థకు చేరిన పాఠశాల అదనపు గదులు



నిర్మాణంలోనే శిథిలావస్థకు చేరిన పాఠశాల అదనపు గదులు

ఉప్పునుంతల: మండలంలోని తిర్మలాపూర్ ప్రాథమిక పాఠశాలలో దాదాపుగా పదిహేనేళ్ల క్రితం మంజూరైన అదనపు గదుల నిర్మాణం అర్థాంతరంగా వదిలేయడంతో శిథిలావస్థకు చేరింది. పాఠశాల ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారుల కళ్ల ఎదుట దిష్టి బొమ్మలా దర్శనమిచ్చే ఈ అర్థాంతరపు నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకరావాలన్న ఆలోచన వారిలో ఏమాత్రం రావడం లేదు. ప్రస్తుతం పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పాఠశాల భవనం, మౌలిక వసతులు సరిగాలేక తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడానికి ఇష్టపడటంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణాన్ని పూర్తి చేయించడంతో పాటు ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనానికి మరమ్మతు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి



ప్రమాదకరంగా రోడ్డు పక్కన ఉన్న గుంత

తాడూరు: మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్ మీదుగా ఐతోల్‌కు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు తాడూరు సమీపాన నెల రోజుల క్రితం వైఫై కేబుల్ లైన్ కోసం తవ్విన గుంత ప్రయాణికులకు ఆందోళనకరంగా మారింది. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వైఫై కనెక్షన్ కోసం తవ్విన గుంతను పూడ్చకుండా వదిలేయ్యడం వల్ల అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇరుకైన రోడ్డు ఆ రోడ్డుకు అనుసరించుకొని తవ్విన గుంత ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.